క్లుప్తంగా

శ్రీశ్రీనివాసుడికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం చిట్టినగర్‌లోని శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకాలు చేశారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించిన అర్చకులు మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మార్మోగింది. అభిషేకం అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ, తులసీదళ అర్చన నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి పంచహారతుల సేవ, ఏకాంత సేవ నిర్వహించారు. అభిషేకానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దేవస్థాన కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మార్చి 2వ తేదీన రాజమండ్రిలోని పుష్కరాల రేవు దగ్గర చందా సత్రంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) విలీన సభ నిర్వహిస్తున్నామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ చెప్పారు. విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్‌లోని పూలే-అంబేడ్కర్ భవన్‌లో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని కార్మిక వర్గాన్ని కార్పొరేట్ వర్గాలకు బానిసలుగా చేసేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని, ఇలాంటి పరిస్థితులలో ఐక్య కార్మిక ఉద్యమాల ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి, ఉపాధ్యక్షులు ఎం.ఏసు, ఆర్.హరికృష్ణ, జె.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఆర్.మోహన్, ఎం.వెంకటేశ్వర్లు, కె.రమణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ):విద్యాధరపురం రామరాజ్యనగర్ సెక్షన్ 33/11 కేవీ కబేళా విద్యుత్ ఉపకేంద్రంలో 11కేవీ ఊర్మిళానగర్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతులతో పాటు మెయింటెనెన్స్ కారణంగా ఆయా ప్రాంతాల్లో గురువారం ఉదయం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పీ రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.
స్థానిక ఊర్మిళానగర్, ఏకలవ్య నగర్, నులకపేట, రెడ్డి కాలనీ, బొమ్మసాని నగర్, పోలేరమ్మ టెంపుల్ రోడ్, సీతారెడ్డి కాలనీ, వెటర్నరీ కాలనీ, హెచ్‌బీ ఫంక్షన్ హాల్ ఏరియా, పైప్ డీలర్స్ యార్డ్ తదితర ప్రాంతాలలో ఉదయం 8నుంచి పదిగంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే

ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి



వించిపేట(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రజలకు హామీలు ఇచ్చి మోసం చేయడం అలవాటేనని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి విమర్శించారు. వించిపేటలోని కమ్యూనిటీ హాలులో ఎంసీపీఐ విజయవాడ నగర 2వ మహాసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చి నిలువునా మోసం చేశారని ఆరోపించారు. ఏటా రైతులకు రూ. 20వేలు ఇస్తానని, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు, తల్లికి వందనం పేరుతో ఏడాదికి రూ.18వేలు ఇస్తానని హామీలు ఇచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పేదలకు అర్బన్‌లో రెండు సెంట్లు, రూరల్‌లో 3 సెంట్లు స్థలంలో ఇల్లు కట్టించి ఇస్తానని పేదలకు అబద్ధాల హామీలు గుప్పించారన్నారు. రాష్ట్రంలో పత్తి, మిర్చి ధరలు గణనీయంగా తగ్గిపోయాయని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాన్నారు. గ్రామాలు, పట్టణాలలో బెల్టు షాపుల ద్వారా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు ఇచ్చిన హామీల అమలుకు ఎంసీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని ఆయన వివరించారు.

నూతన కమిటీ ఎన్నిక....
అనంతరం ఈ మహాసభలో ఎంసీపీఐ నగర నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కసాని గణేష్‌బాబుతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులుగా వల్లెపు లక్ష్మీనారాయణ, కంకిపాటి అనిల్ కుమార్, కాసాని సుజాత, అనకాపల్లి కనకరాజు, మంగళగిరి శేషు, సోమి ఎల్లమ్మ తదితరులను ఎన్నుకున్నారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు



విజయేశ్వరస్వామి దేవస్థానంలో క్యూలైన్లలో భక్తులు



పాతశివాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):మహా శివరాత్రి పర్వదినాన చిట్టినగర్ పరిధిలోని ఆలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి స్వామి వారి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు, దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వాగు సెంటర్‌లో...
శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో స్వామివారికి 11 రకాల ద్రవ్యాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలను అర్చకులు విన్నకోట శ్రీనివాసరావుశర్మ నిర్వహించగా, ఆలయ ఈవో వై. సీతారామయ్య ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి కల్యాణం కన్నుల పండువగా సాగింది. ఉత్సవాన్ని ఆలయ ఫౌండర్ చైర్మన్ నందిపాటి నాగ వెంకట శ్రీనివాసరావు పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చారు.

భీమనవారిపేటలో...
భీమనవారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్‌శర్మ పెళ్లి తంతును జరిపించారు. అనంతరం భక్తులు, ఉభయదాతలు స్వామివారికి తలంబ్రాలను సమర్పించారు.

చిట్టినగర్‌లో...
కొత్త అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి భక్తులు పెద్దఎత్తున అభిషేకాలు చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో క్యూలైన్ ఆలయం వెలుపల కేటీరోడ్డుపైకి చేరింది. సాయంత్రం శ్రీగంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామివార్ల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు చింతలపాటి కాశీవిశ్వనాథ్ శిష్యబృందం అత్యంత వైభవోపేతంగా జరిపించగా, కల్యాణాన్ని వీక్షించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకుంది. మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు కమిటీ కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

ముక్కంటి దర్శనానికి పోటెత్తిన భక్తులు
వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం వన్‌టౌన్‌లోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పరమశివుని దర్శనార్థం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచి ఆయా ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, బిల్వార్చనలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామార్చనలు చేశారు.

పాతశివాలయంలో...
వన్‌టౌన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో (పాతశివాలయం) బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాలతో అభిషేకం



వాగుసెంటర్‌లో స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్

చేశారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు.. రాత్రి లింగోద్భవ కాలం తరువాత స్వామివారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు.

శ్రీ నగరేశ్వర వారి దేవస్థానంలో....
వన్‌టౌన్ శేషయ్యవీధిలోని శ్రీ కన్యకాపరమేశ్వరి నగరేశ్వరస్వామి వారి దేవస్థానం (కొత్తగుళ్ళు) భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు సాంబశివరావు, చెవిటి శ్రీనివాసులు, పర్యవేక్షించారు. అదేవిధంగా పాతబస్తీలోని శ్రీ విజయేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదసరోద్రాభిషేకం నిర్వహించారు. సైకంవారివీధిలోని శ్రీ దర్వేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఆలయ కమిటీ చైర్మన్ రాంపిళ్ల జయప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అర్చకుడు మురళీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు కొనసాగాయి.

శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో
కేటీరోడ్డులోని శ్రీ గంగానమ్మ దేవస్థానం ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో విశేష పూజలను నిర్వహించారు. భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. రాత్రి లింగోద్భవ కాలంలో స్వామి వారికి విశేష అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త పర్యవేక్షించారు. భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ ప్రారంభించారు. అదేవిధంగా కొత్తపేట కుమ్మరివీధిలో వేంచేసి ఉన్న శ్రీ పాండురంగస్వామి వారి దేవస్థానంలో కొలువైన శ్రీపర్వత వర్ధని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం అభిషేకాలను పూర్తి చేసి మధ్యాహ్నం స్వామి వారిని నయనానందకరంగా అలంకరించారు.రుద్రహోమాన్ని నిర్వహించారు.



స్వామివారిని దర్శించుకుని హారతి అందుకుంటున్న భక్తులు

భక్తులకు అన్నప్రసాదం పంపిణీ



ప్రసాదాలను పంపిణీని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మండేపూడి చటర్జీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మహాశివరాత్రి వేడుకలు పురస్కరించుకొని లక్షలాదిగా తరలివచ్చిన భక్తులకు పాతబస్తీలోని డైమండ్ లోటస్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అన్నప్రసాద వితరణ చేశారు. దుర్గాఘాట్, పాతశివాలయం తదితర ప్రాంగణాల నుంచి భారీగా తరలివచ్చిన భక్తులకు కెనాల్‌రోడ్డు వద్ద ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని వాసవీ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు వేముల హజరత్తయ్యగుప్తా ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. భక్తులకు వివిధ రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు వీవీఎస్ పానకాలు, గుంటూరి దుర్గాప్రసాద్, కోశాధికారి ఇమంచి శ్రీమన్నారాయణ, కన్వీనర్ సముద్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నూకల మురళి ఫ్రెండ్స్ గ్రూపు ఆధ్వర్యంలో....
మహాశివరాత్రి సందర్భంగా నూకల మురళి ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో ప్రసాదాలు పంపిణీ చేశారు. కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి దగ్గర 10 వేల మంది భక్తులకు చక్కెరపొంగళి, పులిహోర, దద్దోజనం, కదంభం, స్వీట్లు తదితరాల ఎనిమిది రకాలు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 37 వ డివిజన్ కార్పొరేటర్ మండేపూడి చటర్జీ, కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, వక్కలగడ్డ అమర్, వందనపు శ్రీనివాసరావు, మాడుగుల వరప్రసాద్, బయన కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాఘాట్‌కు పోటెత్తిన భక్తజనం



దుర్గాఘాట్‌లో పుణ్యస్నానమాచరిస్తున్న భక్తులు



పిండప్రదానాలు చేస్తున్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పవిత్ర కృష్ణానదిలో భక్తులు పెద్ద ఎత్తున పుణ్యస్నానాలు ఆచరించారు. బుధవారం తెల్లవారుజాము రెండు గంటల నుంచే భక్తులు, యాత్రికులు స్నానఘట్టాలకు తరలివచ్చారు. దుర్గాఘాట్‌తో పాటు భవానీ, పున్నమి ఘాట్లల్లో సైతం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. దుర్గాఘాట్‌లో భక్తుల రద్దీ క్రమం క్రమంగా పెరుగుతూ ఉండటంతో వారికి ఎటువంటి ఇబ్బంది కలుగకుండా దుర్గగుడి దేవస్థాన అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. స్నానఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించిన మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేకంగా షామియానాలను ఏర్పాటు చేశారు. స్నానఘాట్ బయట కంపార్టుమెంట్ విధానాన్ని పోలీసులు అమలు చేశారు. స్నానఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరించి బయటకు వచ్చిన తర్వాతే క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులను నదీ తీరంలోకి అనుమతించారు. దుర్గాఘాట్‌లో నదీ స్నానంతో పాటు జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేయడంతో భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్నానాలు ఆచరించారు. మరో వైపున కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానం చేసుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 10 గంటల వరకు పుణ్యస్నానాలు కొనసాగుతూనే ఉన్నాయి.

నేత్రపర్వంగా కల్యాణోత్సవం





ప్రత్యేకాలంకరణలో నగరేశ్వరస్వామి, విజయేశ్వరస్వామివార్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదిదంపతులైన గంగా పార్వతి సమేత పరమేశ్వరుని కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పాతబస్తీలోని వివిధ ఆలయాల్లో స్వామి వారి కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి వేళ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ అభిషేకాలతో వైదిక కార్యక్రమాలను నిర్వహించిన అర్చకస్వాములు సాయంత్రం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి స్వామివారి ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణోత్సవాలను నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం), శ్రీ నగరేశ్వరస్వామి వారి దేవస్థానం, శ్రీవిజయేశ్వర స్వామి దేవస్థానంతోపాటుగా పలు ఆలయాల్లో రాత్రి లింగోద్భవ కాలంలో స్వామి వారికి విశేష అభిషేకాలను నిర్వహించి అనంతరం కల్యాణోత్సవాలను నిర్వహించారు. గణపతి పూజతో కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టిన అర్చకస్వాములు తలంబ్రాల సమర్పణతో ముగించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

నగరోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పాత శివాలయంలో నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో వేంచేసి ఉన్న పార్వతీ పరమేశ్వరులు భద్రకాళి సమేత వీరభద్రులను మహాశివరాత్రి పర్వదినం రోజున పెళ్లి కుమారుడిగా పెళ్లి కుమార్తెగా అలంకరించి పురవీధులలో విశ్వబ్రాహ్మణులు నగరోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.అందులో భాగంగా వన్‌టౌన్ బ్రాహ్మణ వీధి, కెనాల్‌రోడ్ సామారంగం చౌక్‌లో నగరోత్సవం సాగింది. విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గొర్తి శ్రీనివాస చక్రవర్తితోపాటు సంఘ సభ్యులు పలువురు ప్రముఖులు పూజాదికాలు చేసి నగరోత్సవాన్ని ప్రారంభించారు. హర హర మహాదేవ శంభో శంకర నినాదాలతో నగరోత్సవం మార్మోగింది. డప్పు వాయిద్యాలు కోలాట నృత్యాలు భూత బేతాళ నృత్యాల నడుమ నగరోత్సవం వైభవోపేతంగా సాగింది. విజయవాడ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గొర్తి శ్రీనివాస చక్రవర్తి మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఏటా నగరోత్సవం అత్యంత నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సీనియర్ ప్రతినిధులు పెదపోలు బ్రహ్మం, నడిపల్లి ప్రసాద్, జగన్, నాగాచారి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళకు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ద్విచక్రవాహనంపై వెళుతున్న మహిళను ఢీ కొట్టడంతో గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడుకు చెందిన పి.సందీప్ భార్య బి.తేజస్విని విద్యుత్‌సౌధలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 25వ తేదీ ఉదయం విధులకు స్కూటీపై వెళుతున్న తేజస్విని రామవరప్పాడు ఫ్లై ఓవర్ వద్ద దిగుతుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన తేజస్వినిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హాస్పిటల్ నుంచి వచ్చిన సమాచారం మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో దోమల నివారణకు ప్రత్యేక డ్రోన్లు



డ్రోన్ ద్వారా కాలువలో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేస్తున్న దృశ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): దోమల కారణంగా నగర ప్రజలు అనారోగ్యం పాలవ్వకుండా ఉండేందుకు నగరపాలక సంస్థ ప్రత్యేక డ్రోన్లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దోమల నివారణ చర్యల కోసం రూ.17లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన రెండు మలేరియా స్ప్రింగ్ డ్రోన్లతో బుధవారం రామకృష్ణాపురం బుడమేరు కాలువలో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు.
నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను అరికట్టి ప్రజలు దోమకాటు బారిన పడకుండా ఒక వైపు యాంటి లార్వా మలేరియా ఆపరేషన్స్ చేస్తున్నప్పటికీ, వరదల తరువాత కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ప్రతిరోజు తొలగిస్తున్నామని కమిషనర్ ఆ ప్రకటనలో వివరించారు. కాలువల్లో నిల్వ ఉన్న నీళ్లల్లో దోమలు ఉత్పత్తి కాకుండా ఉండేందుకు రెండు డ్రోన్ల ద్వారా నిరంతరం ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేసే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా బుడమేరు వరదల అనంతరం ఖాళీ స్థలాలు, బుడమేరు కాలువలో దోమల ఉత్పత్తి ఎక్కువైందన్నారు. వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఇంకా దోమల సమస్య కొనసాగుతుందన్నారు. దోమల నివారణకు నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యలతోపాటు ప్రజల సహకారం కూడా ఉండాలని కమిషనర్ కోరారు.

ఆధ్యాత్మికతే సమాజ శాంతికి మూలం



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న హజరత్తయ్య గుప్తా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):ప్రజలలో భక్తి భావాలు పెరిగి ఆధ్యాత్మిక చింతనతో సాగితే పాప పుణ్యాల విచక్షణ తెలిసి సమాజంలో శాంతి సౌఖ్యాలు నెలకొంటాయని ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని వాసవి క్లబ్ డైమండ్ కపుల్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక సత్యనారాయణపురంలోని సీతారామ కళ్యాణమండపంలో విశేష పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షులు వేముల హజరత్తయ్య గుప్తా కాశీవిశ్వేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. ఏర్పాట్లను క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బోడ నాగదుర్గ, మల్లీశ్వరి, సభ్యులు పర్యవేక్షించారు.

భక్తులతో కిక్కిరిసిన కెనాల్ రోడ్డు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వన్‌టౌన్‌లోని కెనాల్ రోడ్డు భక్తులతో కిక్కిరిసి పోయింది. దుర్గాఘాట్‌కు పవిత్ర స్నానాల నిమిత్తం వెళ్లే భక్తుల రాకపోకలు, ఆలయాలకు వెళ్లే జనంతో కెనాల్‌రోడ్డ కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకూ రద్దీ కొనసాగింది. ఒకవైపు వివిధ సేవాసంస్థలు ప్రసాద వితరణ, భోజనం, అల్పాహారం వంటి ఆహార పదార్థాల పంపిణీలను చేపట్టడంతో భక్తులు కిక్కిరిసి కనిపించారు. చిరువ్యాపారుల సందడితో కెనాలరోడ్డులో రాకపోకలు స్తంభించాయి.
మహాశివరాత్రి సందర్భంగా వన్‌టౌన్‌లో పోలీసులు పటిష్ఠ బందోబస్తును చేపట్టారు. ముఖ్యంగా కెనాల్‌రోడ్డు, దుర్గాఘాట్, పాతశివాయంతో పాటుగా బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాల్లో వందలాది మంది సిబ్బందితో నగర పోలీస్ కమిషనర్ ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. బాంబుస్క్వాడ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా పాత అశోక్‌పిల్లర్ కూడలి వద్ద ఉదయం ప్రజల రద్దీ అధికం కావడంతో ఘాట్‌లోని భక్తులను త్వరతగతిన బయటకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు.

దినవాహి సత్రం ఆధ్వర్యంలో అన్నదానం
పాతశివాలయం సమీపంలోని దేవదాయ శాఖకు చెందిన దినవాహిసత్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ అన్నదాన కార్యక్రమాలు భారీగా సాగాయి.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని రమణీయంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి అధిష్టింపజేశారు. అనంతరం విష్వక్సేనపూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అలాగే మహాసంకల్పం, పుణ్యాహవచనం, మధుపర్కాల సమర్పణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. భక్తుల హరినామస్మరణ, మంగళవాయిద్యాలు, అర్చకస్వాములు మంత్రోచ్ఛరణల నడుమ స్వామి వారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకస్వాములు పి.శ్రీరామచంద్రమూర్తి నిర్వహించారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం..
స్వామివారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారి మూలమూర్తికి తిరుమంజన అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అందులో భాగంగా పంచామృత, సుగంధ, ఫల రసాలతో స్వామి వారి మూలమూర్తులకు అర్చకస్వాములు ప్రత్యేక అభిషేకాలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం స్వామివారికి విశేష అలంకారం చేశారు.

వైద్య పరికరాల నిర్వహణపై నర్సింగ్ సిబ్బందికి శిక్షణ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర పరిస్థితుల్లో వాడే వైద్య పరికరాలను రోగులకు వినియోగించడంపై నర్సింగ్ సిబ్బందికి అవగాహన కలిగించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సెరిక్స్ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా టీచింగ్ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కూడా నర్సింగ్ సిబ్బందికి పలు అత్యవసర పరికరాలు నిర్వాహణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెరిక్స్ సంస్థ డివిజన్ మేనేజర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ వైద్య పరికరాలను వినియోగించే పద్ధతులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు రకాల పరికరాలను వినియోగించే తీరును వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎన్‌కే మోహమ్మద్, జీజీహెచ్ బయోమెడికల్ ఇంజినీర్ జనార్ధనరావు, సాంబాద్, అమర్, హెడ్‌నర్సు జాన్సన్‌రాణి తదితరులు పాల్గొన్నారు.